క్లుప్తంగా

బ్యాంక్ కెనాల్‌లను ఆధునీకరిస్తాం..

కె.గంగవరం: గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని అన్ని బ్యాంకు కెనాల్‌లను ఆధునీకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మసకపల్లి, కూళ్లలోని బ్యాంక్ కెనాల్‌లను ఆయన పరిశీలించారు. కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ లాకులు, కెనాల్‌ను ఆధునీకరించేందుకు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. బ్యాంకు కెనాల్‌లు గతంలో 10 మీటర్ల వెడల్పు ఉండేవని, ప్రస్తుతం ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వైస్ చైర్మన్ డీసీలు తమలంపూడి సుధాకర్‌రెడ్డి, డీసీలు కృష్ణ చైతన్య, వేగేశ్న భాస్కర్‌రాజు, సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శక్తి వేషం



శక్తి వేషధారణతో అలరిస్తున్న పగటి వేషగాళ్లు

రాయవరం: పొట్టకూటి కోసం వివిధ రకాల వేషధారణలతో ప్రజలను అలరిస్తూ జీవనోపాధి పొందుతారు. అందులో భాగంగా రాయవరంలో గురువారం విప్పర్తి కృపావరం ఆధ్వర్యంలో ప్రసాద్ శక్తి వేషధారణ చేశారు. కృపావరం, నాగరాజులు డప్పు వాయిద్యానికి అనుగుణంగా ప్రసాద్ శక్తిని అనుకరిస్తూ అభినయించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రోజుకో వేషధారణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు కృపావరం తెలిపారు.

అధునాతన వైద్య పరీక్షలతో పశువుల సంరక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): అధునాతన వైద్య పరీక్షలతో పశువులను సంరక్షించుకోవచ్చని మండపేట పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శిక్షణ కేంద్రం జేడీ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. పాలతోడులో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.

శిబిరంలో గర్భకోశ వ్యాధులకు సంబంధించి అల్ట్రా ట్రాన్స్‌రెక్టల్ స్కానింగ్ పరీక్షలు చేశారు. సాధారణ పరీక్షలు చేసి పాడి రైతులకు పలు సూచనలు చేశారు. శిబిరంలో డాక్టర్లు పి.నాగమణి, జేఎస్‌వీ సునీల్, సుబ్బారావు, పలువురు ట్రైనీ డాక్టర్లు సుమారు 90 పశువులను పరీక్షించారు. వివిధ రకాల మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, లిక్విడ్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు బొబ్బిలి నాగేశ్వరరావు, నాయకులు పిల్లా తాతాలు, యేలేటి వెంకట్రావు, సత్రాకుల అబ్బులు, బొక్కా రామకష్ణ, అన్నందేవుల సూర్యచంద్రరావు, కోడి సుబ్రహ్మణ్యం, అన్నందేవుల వెంకటేశ్వరరావు, తాతపూడి లాజరు, పిల్లా సత్యానందం, అన్నందేవుల వీర అయ్యప్ప, గ్రామ కార్యదర్శి కె.వరప్రసాద్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో అనవసరపు వ్యయాలను తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న పొలంబడులను రైతువాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం తర్లంపూడిలో ఎంపీటీసీ గొల్లపల్లి సింహాద్రి అధ్యక్షతన వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ అశోక్ మాట్లాడుతూ వరిసాగులో పంట దశలకు అనుకూలంగా వినియోగించాల్సిన ఎరువులు, తెగుళ్ల ఉధృతి తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకే విధానాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, మాజీ సర్పంచ్ వీరబోయిన వెంకట్రావు, ఆదర్శ రైతులు జక్రయ్య, తాతారావు, కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ దర్శిని పోస్టర్ల ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: పరమ శివునికి ప్రీతికరమైందిగా భక్తులు భావించే కార్తిక మాసంలో శైవ క్షేత్రాలకు భక్తులు వెల్లువెత్తుతారు. అందులోనూ పంచారామ క్షేత్రాలకు కార్తిక సోమవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని మహా శివుని దర్శించుకుంటారు. భక్తులకు సెంటిమెంట్‌కు ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీ ఏటా భక్తులకు కానుకగా 'పంచారామ దర్శిని' పేరుతో అందుబాటు ధరల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. దీనిలో భాగంగా రామచంద్రపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు ఆయా తేదీలకు ముందు రోజు అంటే ఆదివారాల్లో అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో రాత్రి బయలుదేరి, భక్తులకు సోమవారాల్లో పంచారామ క్షేత్రాల దర్శన భాగ్యం కలిపించి తిరిగి రామచంద్రపురం డిపోకు చేరుకుంటాయి. ఈ మేరకు గురువారం పంచారామ దర్శిని వాల్‌పోస్టర్లను డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు గురువారం సిబ్బందితో కలసి విడుదల చేశారు.

ప్రయాణం.. ప్రమాదం

- ప్రమాదకరంగా దంగేరు–కుడుపూరు రహదారి
- తరచూ యాక్సిడెంట్లు
- రోడ్డులోని మలుపులో ఘటనలు
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: ఆ రోడ్డులోని మలుపు చాలా ప్రమాదకరంగా మారింది. దానికి తోడు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలతో ముందు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. కె.గంగవరం నుంచి దంగేరు, కుడుపూరు మీదుగా పేకేరు వరకు రహదారి ఉంది. దీనిలో దంగేరు నుంచి పేకేరు వరకు టేకి డ్రైన్‌ను అనుకుని ఉంటుంది. రెండేళ్ల క్రితం ఈ రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేశారు. ఇదిలా ఉండగా దంగేరు నుంచి కుడుపూరు వరకు గల రహదారిలో సావరం దాటిన తర్వాత మలుపు ప్రమాదకరంగా మారింది. మార్జిన్లు తక్కువగా ఉండడంతో పాటు తుప్పలు పెరిగడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

పలు ప్రమాదాలు

ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడ్డారు. ఒక ఆటో ప్రమాదంలో ఒకరు, లారీ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి కన్నుమూశారు. రోడ్డు పక్కనే టేకి డ్రైన్ ఉండటంతో పాటు ఇరువైపులా పెరిగిన తుప్పల కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదంగా మారింది. గతేడాది కురకాళ్లపల్లి గ్రామానికి చెందిన సూరంపూడి శ్రీనివాస్ (40) ఇదే రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో వాహనాలు పల్టీలు కొట్టి పలువురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం మలుపేనని స్థానికులు చెబుతున్నారు.



దంగేరు - కుడుపూరు రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశం



గతంలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

భయం భయంగా..

ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. దంగేరు నుంచి కుడుపూరు మీదుగా పేకేరు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర టేకి డ్రైన్‌ను అనుకుని ఆర్అండ్‌బీ రహదారి ఉంది. నిత్యం వందల వాహనాలు ఇదే రోడ్డు మీదుగా వెళుతుంటాయి. దీనితో పాటు పేకేరు, కుడుపూరు, భట్లపాలిక తదితర ప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలల బస్సులు కూడా తిరుగుతుంటాయి. ఈ రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డును వెడల్పు చేయాలి



దంగేరు నుంచి పేకేరు వరకు గల రోడ్డును వెడల్పు చేయాలి. సావరం రోడ్డు నుంచి కుడుపూరు వరకు గల రహదారి చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– రాయుడు జగన్, పేకేరు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నా, వాటి నివారణకు అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తుప్పలను తొలగించడంతో పాటు బెర్ములు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– మేడిశెట్టి ఇశ్రాయేలు, మసకపల్లి

ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యాన్ని గుర్తించాలి



మండపేటలో నూతన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ సోమిరెడ్డి

కపిలేశ్వరపురం (మండపేట): ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యాన్ని గుర్తించాలని ఎంఈఓ సీహెచ్ సోమిరెడ్డి నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు సూచించారు. మండపేట పట్టణంలోని వివిధ పాఠశాలల్లో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులను యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్వాగతం పలికారు. వారికి సంఘం నాయకులు సర్వీస్ రూల్స్ బుక్, సంఘం డైరీలను అందజేశారు. ముఖ్యఅతిథి ఎంఈఓ సోమిరెడ్డి మాట్లాడుతూ మహోన్నతమైన ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపాలకృష్ణారెడ్డి, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజేంద్ర, మండల శాఖ ప్రధాన కార్యదర్శి తాడి శ్రీనివాస్, జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం సహాధ్యక్షుడు జి.సుధాకర్, హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, నాయకులు ఎం.శ్రీనివాస్, కె సత్తిబాబు, వీవీ శ్రీదేవి పాల్గొన్నారు.

మద్యం విధానంపై నీచ రాజకీయాలు మానుకోవాలి



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే స్థాయిలో కూటమి నేతలు ఆదాయాలను పెంచుకునే దిశగా మద్యం విధానం అమలవుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ మద్య విధానం, నకిలీ మద్యం తయారీ, సరఫరా, విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఆరోపణలను తప్పుబడుతున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో జనావాసాలు మధ్య బెల్ట్ షాపులు లేవని ఎమ్మెల్యే చెప్పదలిచారా అని ప్రశ్నించారు. బడి, గుడి, గ్రామాలు, పట్టణ కూడళ్లలో మద్యం ఏరులై పారుతుంటే ఎమ్మెల్యే వేగుళ్లకు కనిపించడం లేదా అన్నారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద కూర్చుంటే కూటమి ప్రభుత్వ మద్య ప్రవాహం ఎలా పారుతుందో ఎమ్మెల్యే వేగుళ్ళ కళ్ళారా చూడొచ్చన్నారు. మద్యం షాపులు నుండి కూటమి ఎమ్మెల్యేలు పావలా వాటా తీసుకుంటున్నారంటూ వార్తలు వస్తున్నాయన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో పరిమితమైన సంఖ్యలో గ్రామ శివార్లలో మద్యం దుకాణం ఉండేదన్న విషయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల గుర్తించాలన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కూటమి ప్రభుత్వ ప్రోద్బలంతో ఫ్యాక్టరీ స్థాయిలో నకిలీ మద్యం తయారీ జరుగుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆఫ్రికా కంపెనీల ద్వారా నకిలీ మద్యం తయారు చేయించి ఆంధ్రప్రదేశ్‌ను 'మద్యాంధ్రప్రదేశ్'గా మార్చేశారన్నారు. కూటమి నేతలు చేస్తున్న నకిలీ మద్యం వ్యాపారాన్ని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌పై నెట్టాలనుకునే నీచ రాజకీయాలకు కూటమి నేతలు తెరదించాలన్నారు. మండపేట మండలంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.18 నుంచి రూ.20కి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కూటమి ఎంచుకున్న రైస్ మిల్లర్ల ద్వారా కిలో రూ.40కి విదేశాలకు అమ్ముతూ కూటమి నేతలు ప్రజల సొమ్మును దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లను గౌరవంగా చూసిన సంగతిని గుర్తు చేశారు. రాయవరం మండలం వెంటూరు రేషన్ డీలర్‌ను భయపెట్టి పార్టీలో చేర్చుకున్నారని, చేరగానే ఆ షాపుపై కేసులు ఎలా అదృశ్యమయ్యాయో ఎమ్మెల్యే వేగుళ్ళకే తెలియాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండపేట పట్టణ బస్టాండ్ ఆవరణలోని రిక్షా స్టాండ్‌ను మెరుగుపర్చగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రిక్షాస్టాండ్ బోర్డును తొలగించి రిక్షా కార్మికులను తీవ్ర వేదనకు గురిచేస్తుందన్నారు. బోర్డును తొలగించిన విషయం తనకు తెలియదని ఎమ్మెల్యే వేగుళ్ళ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ తోట ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా అధికారులు రిక్షాస్టాండ్ షెడ్డులో మెప్మా స్టాల్ ఏర్పాటు చేశారా అని ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు కురుపూడి రాంబాబు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, మెండి బాపిరాజు, నాయకులు ఎర్రగుంట అయ్యప్ప, పిల్లా వీరబాబు, యరమాటి వెంకన్నబాబు, పోతుల ప్రసాద్, యాదగాని రామకృష్ణ, గణేష్, మేడిశెట్టి గోవిందు, కోళ్ళ శ్రీను పాల్గొన్నారు

వ్యవసాయ పద్ధతులపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం (మండపేట): మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రతి రైతుకి అవగాహన అవసరమని ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు సీహెచ్‌కేవీ చౌదరి అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో గురువారం మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ చౌదరి మాట్లాడుతూ రసాయన అవశేషాలు లేనటువంటి ఆహార ధాన్యాలను పండించడం ద్వారా మానవ ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరుచుకోవొచ్చు అన్నారు. విచక్షణ రహితంగా పురుగుమందులు పిచికారీ చేయడం అశాస్త్రీయం అన్నారు. కె.ప్రభాకర్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంపైనా, మిత్ర పురుగులను కాపాడుకోవడంపైనా రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విజేతలైన రైతులకు సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, నీటి సంఘం సభ్యుడు ముత్యాల అన్నవరం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ, వ్యవసాయ సహాయకులు షేక్ బాజీ రైతులు పాల్గొన్నారు.



మారేడుబాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న చౌదరి

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో బాణసంచా మృతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న సభ్యులు

రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే తొలుతగా ఈ నెల 8న జరిగిన బాణసంచా ప్రమాదంలో మృతుల కుటుంబాలకు సంతాప సూచకంగా సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం జరిగిన సమావేశంలో శాఖా పరంగా సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, లోవోల్టేజీ సమస్య ఎక్కడా ఎదురుకాకుండా చూడాలని, నిరంతరాయంగా ప్రజలకు తాగునీరు అందించే విధంగా ఆయా శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సోమేశ్వరం–రాజానగరం ప్రధాన రహదారి ప్రత్యేక మరమ్మతులు, అభివృద్ధికి రూ.3.75 కోట్లు మంజూరైనట్లు జోగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన, ఇన్‌చార్జ్ తహసీల్దార్ బీవీ భాస్కర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు



గుబ్బలవారిపేటలో కోటి సంతకాల సేకరణ చేస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ చేస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- పట్టణంలో కోటి సంతకాల సేకరణ

రామచంద్రపురం: ప్రభుత్వ పరంగా నిర్మించాల్సిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యాన్ని దూరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో కోటి సంతకాల సేకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు పట్టణంలోని గుబ్బలవారిపేట 27వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను విద్యార్థులు, మహిళలు, రైతులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్యాన్ని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పటికే ఐదు కళాశాలలను పూర్తి చేసి తరగతులు కూడా ప్రారంభిస్తే, కూటమి నేతలకు అవి కనిపించటం లేదని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలు చేయటం దారుణమన్నారు. కళ్లెదురుగా కళాశాలల నిర్మాణం ఉన్నా, దారుణంగా అబద్ధాలు వల్లిస్తూ, పీపీపీ విధానంలో కూటమి నేతలకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టే దారుణానికి ఒడిగట్టారని విమర్శించారు. కేవలం రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తే మిగిలిన మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉన్నా, పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం తెరపైకి తెచ్చిందన్నారు. కోటి సంతకాల సేకరణ చేసి ప్రజా వ్యతిరేకత ద్వారా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, పట్టణ, మండల కన్వీనర్లు గాదంశెట్టి శ్రీధర్, పోలినాటి ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్లు పాటి ప్రసాద్, కురుపూడి భీమన్న, దంగేటి సూరిబాబు, అనుసూరి శ్రీనివాస్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సెమినార్‌కు ఎంపిక



సెమినార్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ఎస్ఎస్‌వీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండపేట మండల స్థాయి విద్యా వైజ్ఞానిక సెమినార్‌లో ప్రతిభ కనబర్చారు. క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్, చాలెంజెస్ అంశంపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఎస్ఎస్‌వీపీ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి వి.నవ్యశ్రీ ప్రథమ స్థానం, ఈ.గాయత్రిదేవి ద్వితీయ స్థానంలోనూ నిలిచారు. వారు అమలాపురంలో నిర్వహించే జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు, పర్యవేక్షణ ఉపాధ్యాయులు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, మానేపల్లి శ్రీనివాస్‌లను ఎంఈఓ సీసెచ్‌వీ సోమిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు టీవీవీఎస్ఎస్ శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రాంబాబుకు నేతల పరామర్శ

రాయవరం: పినతల్లి వియోగంతో బాధపడుతున్న రాయవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కొల్లి రాంబాబును పలువురు నాయకులు గురువారం పరామర్శించారు. రాంబాబు చినతల్లి దేవుడమ్మ ఈ నెల 15న వృద్ధాప్యంతో మృతి చెందారు. రాంబాబును ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, తమలంపూడి గంగాధరరెడ్డి, ప్రముఖ న్యాయవాది తాడి రామచంద్రారెడ్డి తదితరులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, యానం రహదారిలో చేదువాడ వంతెన వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన వక్కలంక సతీష్‌కుమార్ తన స్కూటరుపై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. చేదువాడ వంతెన దిగువలో సెంటరుకు వచ్చే సరికి స్కూటరు అదుపుతప్పి రోడు పక్కన ఉన్న గోతులో పడింది. ఈ సంఘటనలో సతీష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతనిని గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు

కె.గంగవరం: కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెల్లుబిక్కుతున్న ప్రజాగ్రహ జ్వాలల్లో దగ్ధమవడం తథ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తామరపల్లిలో గురువారం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నేతృత్వంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడరు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం ఉచితంగా విద్యను అందించడానికి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తే నేటి కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న శ్రద్ధ అర్థమవుతుందని విమర్శించారు. మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, దళిత నాయకులు తోకల శ్రీను, మండల యువజన విభాగం అధ్యక్షుడు రాజు, యంటపల్లి నాని, పటాన్ల వీర వెంకట సత్యనారాయణ, మేడిశెట్టి దుర్గారావు, జంగం సత్తిబాబు, జంగం సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తామరపల్లిలో సంతకాలు సేకరిస్తున్న పెట్టా శ్రీనివాస్ తదితర నాయకులు

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



కూళ్లలో లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

కె.గంగవరం: మండలంలో కూళ్ల, కోటిపల్లి గ్రామాల్లో గురువారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమేష్‌కుమార్ రామ్, ఎస్ఓ మయూర్ వర్మ బృందం పర్యటించింది. ఈ రెండు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా అమలవుతున్న పథకాలకు సంబంధించిన పనులను క్షేత్ర స్థాయిలో వారు తనిఖీ చేశారు. ఎంజీఎన్ఆర్‌జీఎస్ పనులు, డ్వాక్రా రుణాలు, గృహనిర్మాణ శాఖ, పీఎంఏజేవై పనులను వారు స్వయంగా పరిశీలించారు. కూళ్ల గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో ఇళ్ల నిర్మాణం సగంలో నిలిచిపోయిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి నుంచి వివరాలను సేకరించారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ నుంచి వచ్చిన నిధులు అనారోగ్యం కారణంగా ఖర్చు అయిపోయాయని లబ్ధిదారులను బృందం దృష్టికి తీసుకువెళ్లారు. డ్వాక్రా సంఘం ద్వారా వెంటనే రుణాలు అందించడంతో పాటు గృహ నిర్మాణ శాఖ ద్వారా కూడా పెండింగ్ బిల్లులు లబ్ధిదారులకు వెంటనే అందించి, నిర్మాణాలు పూర్తి చేయాలని వారు అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయితీల వద్ద గ్రామ సభ నిర్వహించి పథకాల వివరాలు, లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంజీఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ కె.సత్యనారాయణ, ఈసీ సాగర్, గ్రామ సర్పంచులు నాగేశ్వరరావు, పెమ్మాడి బేబి సత్తిబాబు పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.